క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సిద్ధయ్య



ఉపాధ్యాయుడు సిద్ధయ్య

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు బోధన సామగ్రితో (టీఎల్ఎం) విద్యా బోధన చేస్తూ వారి ప్రగతికి బాట వేస్తున్నాడు మండలంలోని కొంగోడు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జాల సిద్దయ్య. పుస్తకంలో ఉన్న విషయాన్ని బట్టీ పట్టించడం కంటే, ప్రత్యక్షంగా అవసరమైన బోధనా సామగ్రిని రూపొందించి విద్యార్థులకు త్వరగా అర్థమయ్యే రీతిలో బోధన చేయడంలో సిద్దయ్యకు సిద్ధహస్తుడు. తక్కువ సమయంలో ఎక్కువ నేర్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న సిద్దయ్యను ఈ యేడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

సీసీఆర్‌టీకి కవిత ఎంపిక



కవిత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దంతన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) ద్వారా ఉత్తమ బోధన కనబరిచిన ఉపాధ్యాయురాలు కవిత జిల్లా, రాష్ట్ర స్థాయి డెమోలకు ఎంపికైంది. జూన్‌లో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రెనింగ్ (సీసీఆర్‌టీ)లో జిల్లా నుంచి ఉపాధ్యాయురాలు కవిత ఢిల్లీలో పాల్గొంది.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాధిక



రాధిక

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మండల పరిధి గూడూర్ కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం గణిత ఉపాధ్యాయురాలు రాధిక ఎంపికయ్యారు. 2007 నుంచి గణిత బోధన చేస్తూ విధులు నిర్వహిస్తోంది. 2025–26 విద్యా సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం పట్ల మండల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీ విజేతలు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో గురువారం నవ యువ సేవా సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా క్విజ్, వ్యాస రచన, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో ఎంఈఈ ప్రతాప్ రెడ్డి, హెచ్ఎం మహేశ్వర్ ,టీచర్లు పాల్గొన్నారు.

మునిగిన పంట వివరాల సేకరణ



పంట వివరాలు సేకరిస్తున్న ఏఈఓ అనిత

చిలప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాల నేపథ్యంలో పలు గ్రామాలలో నీట మునిగిన పంటల వివరాలు సేకరిస్తున్నామని ఏఈఓ అనిత అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని అజ్జమర్రి, బండపోతుగల్ గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి, మునిగిన పంట వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అజ్జమర్రి, బండపోతుగల్ గ్రామాలలో వరి, పత్తి కలిపి 124 ఎకరాలలో మునిగిందన్నారు. మునిగిన పంట మెరుగయ్యే అవకాశాలు ఉన్న రైతులకు, నివారణ చర్యలు సూచించామని చెపాపరు.

108 రకాల నైవేద్యంతో పూజలు



108 రకాల నైవేద్యాలు పెట్టిన భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రుద్రారం యుజవన సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి 108 రకాల స్వీట్లు, పిండి వంటలను రూపొందించి స్వామివారికి నైవేద్యం పెట్టారు. మహిళలు గోపూజ కార్యక్రమం నిర్వహించారు. కాగా, చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయ మండపం వద్ద చిన్నారులతో పెళ్లి సందడి కార్యక్రమం నిర్వహించారు.

వంతెన నిర్మాణం ఇంతేనా..!

- ఏడాది క్రితం నిర్మాణానికి శిలాఫలకం
- నిధులున్నా ముందుకు సాగని పనులు
- నీటి ప్రవాహంతో ప్రయాణికుల ఇబ్బందులు



రహదారి మధ్యలో లో లెవల్ కాజ్‌వే

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం వచ్చిందంటే చాలు రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలని ఏడాది క్రితం హై లెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదు. ఇది మండలంలోని మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పోతంశెట్టిపల్లికి వెళ్లే రహదారిపై నెలకొన్న పరిస్థితి. పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని దూలకుంట వర్షానికి నిండి అలుగు ఉధృత స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో గ్రామంలోకి వెళ్లే రహదారి మధ్యలో నిర్మించిన లో లేవల్ కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తుండటంతో అటువైపుగా ప్రయాణాలు సాగించే సమీప గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడిన ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. నర్సాపూర్ –మెదక్ జాతీయ రహదారిని, అటు తూప్రాన్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తుంది ఈ రహదారి. మధ్యలో లో లెవల్ కాజ్‌వే కారణంగా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఇబ్బందిని తొలగించేందుకు 2024 జూన్‌లో హై లెవల్ కాజ్‌వే నిర్మాణం కోసం ఎఫ్‌డీఆర్ నిధుల కింద రూ.2.50 కోట్లు మంజూరు చేస్తూ నాటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శిలాఫలకం వేశారు. పనులను పొందిన కాంట్రాక్టర్ పనులను సాగించేందుకు లో లెవల్ కాజ్‌వే పరిసరాలను చదును చేసి అర్ధంతరంగా పనులను ఆపేశాడు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగడం లేదు. ఈసారి కురిసిన భారీ వర్షాలతో మరోసారి లో లెవల్ కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించడంతో ఎప్పటిలాగే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

త్వరగా నిర్మాణం చేపట్టాలి

నిధులు విడుదలైనా వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి నిర్మాణం పనులను త్వరగా చేపట్టాలి.

– భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ



నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

అదనపు గది నిర్మాణానికి భూమి పూజ

హైదరాబాద్ రోటరీ క్లబ్‌ను అభినందించిన ఎంఈఓ



అదనపు గది నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

నర్సాపూర్ రూరల్: అదనపు గది నిర్మించడం అభినందనీయమని నర్సాపూర్ ఎంఈఓ తారాసింగ్ అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల కోసం రోటరీ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అదనపు గది నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అదనపు గది నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. రోటరీ క్లబ్, లైన్స్‌క్లబ్, స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లోని పేద మధ్యతరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పించే సహకారాన్ని అందించాలని కోరారు. రోటరీ క్లబ్ హైదరాబాద్ సభ్యులు మదన్‌మోహన్, ఆదిత్య, కిరణ్ మిత్ర బృందం కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాంబాబు, పీఆర్పీ రాధా గోపాల్ పాల్గొన్నారు.

కనులపండువగా కళాఉత్సవ్



ప్రథమ స్థానం పొందిన పాపన్నపేట విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో గురువారం కళా ఉత్సవ్ పోటీలను విద్యాధికారి ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నృత్యం, పాటలు, వాయిద్యాల పోటీలు నిర్వహించారు. నృత్య పోటీలు సోలో, గ్రూప్ విభాగంలో సంధ్య, సూత్రిక గ్రూప్ (పాపన్నపేట), ప్రథమ స్థానం పొందారు. యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి పొందారు. వాయిద్య పోటీలో బాలాజి (పొడిచన్‌పల్లి) ప్రథమ స్థానం, సాయితేజ (జూనియర్ కళాశాల పాపన్నపేట) ద్వితీయ స్థానం, పాటల పోటీలో సోలో దీపిక (జూనియర్ కళాశాల)గ్రూప్ విభాగంలో కీర్తన గ్రూపు (కొత్తపల్లి) ప్రథమ స్థానం పొందారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా నాగభూషణం, సాయిసిరి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, శ్రీనివాసరావు, టీచర్లు అంజాగౌడ్, నాగరాజు, అనిల్, మోహన్‌రావు, విశ్వనాథ్, నర్సింలు, పరుశురాములు రమేష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించడంతో పాటు తమకు మౌలిక వసతులు కల్పించాలని గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు ఇన్సురెన్స్ కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు రెండు జతల యూనిఫామ్ బట్టలతో పాటు నూనె, శానిటైజర్, మాస్కులు, షూజ్ మొదలైన మౌలిక వసతులు వెంటనే కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు అందజేశారు. ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి గౌరి, పెంటయ్య, పోచయ్య, రాజు, సుశీల, నరేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్: వినాయక నిమజ్జనం కార్యక్రమాలు కొనసాగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వేణు తమ సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం స్థానిక అగ్ని మాపక కేంద్రనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున ప్రజలకు అత్యవసర సమయాలలో సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న జేసీఐ పరిశ్రమ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లిలో విద్యార్థులకు జేసీఐ పరిశ్రమ ప్రతినిధులు గురువారం సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిరోజు సమీప గ్రామాలైన రెడ్డిపల్లి, చేగుంటకు ఉన్నత పాఠశాలల్లో చదువుకునేందుకు నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ విషయం స్వయంగా చూసిన జేసీఐ ప్రైవేటు పరిశ్రమ నిర్వాహకులు విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించుకొని 32 మందికి సైకిళ్లను కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, చేగుంట, నార్సింగి ఎంఈఓలు నీరజ, గంగాబాయి పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మండల విద్యాధికారి నీలకంఠం



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు చదువుతో పాటు కళారంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి నీలకంఠం అన్నారు. గురువారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో కళా ఉత్సవాల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కరుణాకర్, ఎంజేపీ ప్రిన్సిపాల్ సృజన పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో ఇప్పటివరకు 2,323 ఇందిరమ్మ ఇళ్లకు బేస్‌మెంట్ బిల్ జనరేట్ చేయగా, 2,000 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. లక్ష జమ చేశామని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం తెలిపారు. గురువారం మండలంలోని భుజిరంపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ అకౌంట్‌లోకి బిల్లులు జమవుతున్నాయన్నారు. ఇసుక సమస్య తీర్చేందుకు మెదక్, నర్సాపూర్‌లో సాండ్ బజార్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ఎంఈఓ నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న కమిషనర్ గణేష్‌రెడ్డి

తూప్రాన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. ప్రతి శుభకార్యం రోజున మొక్కలు నాటడం చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



శివకుమార్



చంద్రశేఖర్



నవిత



రామేశ్వరీ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలో ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శివకుమార్, భాగీర్థిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చంద్రశేఖర్, చందంపేట పాఠశాల ఉపాధ్యాయురాలు నవిత, సూరారం జెడ్పీపాఠశాల ఉపాధ్యాయుడు మనీష్‌రెడ్డి, తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు రామేశ్వరీ ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అల్లాడుతున్న అన్నదాతలు

యూరియా కోసం తప్పని తిప్పలు



తూప్రాన్‌లో ఆగ్రో వద్ద బారులు తీరిన రైతులు

నర్సాపూర్/శివ్వంపేట(నర్సాపూర్)/తూప్రాన్: యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారు. నర్సాపూర్, శివ్వపేంట, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో గురువారం భారీగా క్యూలు కట్టారు. నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గంటల తరబడి నిరీక్షించి విసిగి తిరుగుపయనమయ్యారు. కాగా యూరియా వచ్చె విషయాన్ని సైతం సరిగా చెప్పడం లేదని రైతులు ఆరోపించారు. శివ్వంపేటలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 10 గంటల వరకు క్యూలైన్‌లో ఎదురుచూసిన రైతులకు యూరియా రావడం లేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లారు. తూప్రాన్ పట్టణంలోని రైతు ఆగ్రో కేంద్రం వద్ద గురువారం రైతులు బారులు తీరారు. గ్రామాల్లో వ్యవసాయాధికారులు ముందస్తుగా ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున టోకెన్లు జారీ చేశారు. యూరియా కోసం రైతులు పోటీపడ్డారు. నిత్యం ఇబ్బందులు పడుతున్నామని యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఉపాధ్యాయ వృత్తి కీలకం

లయన్స్ క్లబ్ ఎల్టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైందని బాలానగర్ లయన్స్ క్లబ్ ఎల్టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముందస్తుగా గురువారం మండల పరిధి దొంతిలో విశ్వనాథ్ లింగోజి స్మారకార్థం ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సమాజంలో భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెల కట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి ఛైర్మన్ లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ టీం

రిటైర్మెంట్ టు ఆధ్యాత్మికం వైపు

- జ్యోతిర్లింగ ఆలయ నిర్మాణం
- భక్తులకు సేవలందిస్తున్న కొత్త ప్రభులు



అబ్దుల్‌కలాం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొత్త ప్రభులు (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు కొత్త ప్రభులు తన జీవితాన్ని ఆధ్యాత్మికం వైపు మళ్లించి అందరి మన్ననలు పొందుతున్నారు. 2006లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆయన అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత పెద్దశంకరంపేట శివారులోని తిరుమలాపూర్‌లో జ్యోతిర్లింగ ఆలయాన్ని నిర్మించి భక్తులకు సేవలందిస్తున్నారు. అలాగే.. మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు.

తైబజార్‌లో మహిళా రైతుపై దాడి



గాయపడిన మహిళా రైతు

మెదక్‌జోన్: తైబజార్‌లో అడిగినంత డబ్బులు ఇవ్వలేదనే కారణంతో గురువారం ఓ మహిళా రైతుపై దాడి జరిగింది. హవేళిఘనాపూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గిరిజన తండాకు చెందిన ఉనికి బీరకాయలను విక్రయించడానికి మార్కెట్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో తైబజార్ నిర్వాహకుడు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. రూ. 20 ఇచ్చింది. అడిగినంత ఇవ్వలేదని మద్యం మత్తులో ఆమెపై దాడిచేశాడు. దీంతో ఆమె ముక్కుకు గాయమై ముక్కు పుల్ల ఎగిరిపోయింది. అనంతరం తోటి రైతులు ప్రశ్నించగా.. బాధిత మహిళకు రూ. 5 వేలు ఇచ్చి జారుకున్నాడు.

సంక్షిప్త వార్తలు

◆ ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలలో వ్యాపారాలు నిర్వహించే వారు ప్రతి సంవత్సరం ట్రేడ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ వ్యాపారస్తులతో ఆర్ఐ సునీల్‌సింగ్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి దుకాణం ముందు రెండు మొక్కలు నాటాలన్నారు.

◆ కూలిన ఇళ్లకు త్వరలో పరిహారం

రేగోడ్(మెదక్): భారీ వర్షాలకు కూలిన ఇళ్ల యజమానులకు త్వరలో పరిహారం మంజూరు కానున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ దత్తారెడ్డి గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో 17 గృహాలు కూలిపోయాయని, నష్టపరిహారం మంజూరు కోసం పతిపాదనలు పంపించామని చెప్పారు.

◆ పౌష్టికాహార కిట్లు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిస్తుందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన శివ్వంపేట, రత్నాపూర్, గూడూర్ తదితర గ్రామాలకు చెందిన గర్భిణిలకు మాతృదేవోభవ కార్యక్రమంలో భాగంగా తన సొంత నిధులతో పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

◆ విద్యుత్‌ను పునరుద్ధరించండి

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని కూచన్‌పల్లిలో కురిసిన వర్షాలతో కూలిపోయిన స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. వారం రోజుల నుంచి మరమ్మతుకు నోచుకోకపోవడంతో పంట పొలాలకు విద్యుత్‌ను పునరుద్ధరించాలని కోరారు.

◆ ఆకట్టుకున్న విద్యార్థుల కళాఉత్సవ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ బాలరాజు ఆధ్వర్యంలో కళాఉత్సవ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయ దుస్తులలో కళా ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లలితదేవి పాల్గొన్నారు.

మండల స్థాయి కళాఉత్సవ్ పోటీలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం మండల పరిషత్ కార్యాల సమావేశం మందిరంలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న వివిధ కళారూపాలను నృత్యరూపకంలో ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. మండల విద్యాధికారి సత్యనారాయణ రావు మాట్లాడుతూ మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి కళాఉత్సవ పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

◆ వంద రోజుల ప్రణాళిక పనుల పరిశీలన

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీలో కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులను గురువారం ఆ శాఖ ఏడీ జోష్ణ సమీక్షించారు. కమిషనర్ దేవేందర్, ఇతర అధికారులతో కలిసి ఆమె పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఏఈ మహేశ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర సైదయ్య ఉన్నారు.

◆ పునఃప్రారంభమైన బోధన్ రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచారం డ్యామ్ వద్ద వరద ఉధృతికి మెదక్–బోధన్ వెళ్లే బ్రిడ్జి కొట్టుకుపోయి దాదాపు వారం రోజుల పాటు రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ, హైవే అథారిటీ శాఖ అధికారులు తాత్కాలిక రోడ్డును వేగవంతంగా పనులు చేయించారు. దీంతో గురువారం నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

◆ తాళం వేసిన ఇంట్లో చోరీ

మనోహరాబాద్(తూప్రాన్): తాళం వేసిన ఓ ఇంట్లో మధ్యాహ్నం చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు మండలంలోని పర్కిబండకి చెందిన పెంటయ్య ఇంటి తాళం పగలగొట్టి తులం చైన్, 5 తులాల వెండి, 3 తులాల ప్రమీదలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

◆ రేషన్ కార్డులు పంపిణీ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధి మల్కాపూర్‌లో గురువారం తహసీల్దార్ అశోక్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు వస్తుందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నూతనంగా రేషన్ కార్డు వచ్చిన వారు వచ్చే నెల నుంచి రేషన్ పొందవచ్చన్నారు.